www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 5 నవంబర్ 2022
5



10న సి.పి.బ్రౌన్ 224వ జయంతి ఉత్సవాలు

కడప అర్బన్ : 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 224 జయంత్యుత్సవాన్ని ఈనెల 10న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని బాధ్యులు డాక్టర్ మూలా మల్లికార్జున రెడ్డి ఒక ప్రకట నలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా, పుస్తకావిష్కర్తగా యోగి వేమన విశ్వవిద్యాలయం వి సి మునగల సూర్యకళావతి, సభాధ్యక్షులుగా ప్ర ముఖ కథారచయిత, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు షేక్ హుస్సేన్ సత్యాగ్ని, విశిష్ట అతిథిగా యోగి వేమన విశ్వవి ద్యాలయం రిజిస్టర్ దుర్భాక విజయ రాఘవప్రసాద్, ప్రధాన వక్తగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్య యన శాఖ రిటైర్డ్ ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రో పన్యాసకులు డాక్టర్ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, గౌరవ అతిథులుగా మొల్ల సాహితీ పీఠం అధ్యక్షులు విద్వాన్ గాను గపెంట హనుమంతరావు, జింకా సుబ్రహ్మణ్యం పాల్గొంటారన్నారు.

హెల్త్ అలవెన్స్ రికవరీ నిర్ణయం దారుణం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం చెల్లిస్తున్న హెల్త్ అలవెన్స్ రికవరీ చేయాలని నిర్ణయించడం దారుణమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నుంచి ఇప్పటి వరకు ఇచ్చిన హెల్త్ అలవెన్స్‌ను రికవరీ చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్‌ల ఎదుట నిరసన కార్యక్రమాలకు రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చిందని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత 2019, ఆగస్టు నుంచి కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లిస్తుందని తెలిపారు. 2022 జనవరిలో చెల్లించేందుకు నిరాకరిస్తే జులై 11 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జెఎసి ఆధ్వర్యంలో చేసిన సమ్మె ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చిందని చెప్పారు. బకాయిలతో సహా చెల్లించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ మేరకు తెనాలి మినహా 122 మున్సిపాలిటీలలో చెల్లించిందని తెలిపారు. సిఎఫ్ఎంఎస్ కార్మికుల గుండెల్లో రైళ్లు పరిగెతించేలా జనవరి నుంచి అలవెన్స్ రికవరీ చేయాలని ట్రెజరీ అధికారులకు గతనెల 22న ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. మున్సిపల్ అధికారులకు నోటీసు ఇచ్చి హెల్త్ అలవెన్స్ రికవరీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఫెడరేషన్ నాయకులు స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రికవరీ ఆపాలని కోరిందన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో 15వేల మంది కార్మికులు చాలీచాలని జీతాలతో దుర్భర జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. వీరిశ్రమను ప్రభుత్వం గుర్తించడం లేదని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు పనిచేశారని చెప్పారు. జీతంలో పదిశాతం కోతవిధించి ఖజానాలో కలుపుకున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు ఇస్తారని ఆశించిన కార్మికులకు నిరాశ మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్‌లు, టిఎ,డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె హామీ మేరకు సంక్షేమ పథకాలు తక్షణమే పునరుద్ధరించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పనికి తగ్గ వేతనం వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవు ట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. లేని పక్షంలో ఈనెల 20 నుంచి 25 మధ్య కాలంలో కార్మికులు సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి,నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర రవి, వై.ఎం. కేశవులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, ఇత్తడి ప్రకాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

భూ కబ్జాలపై సిబిఐతో విచారణ చేపట్టాలి

భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ

ప్రజాశక్తి-కడప అర్బన్

బద్వేల్‌లో చోటు చేసుకుంటున్న భూ కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం సిబిఐతో విచారణ చేయించాలని భూ పోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం పాతబస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూ కబ్జాలు విపరీతంగా పెరిగి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆక్రమార్కులు వేల ఎకరాలు బినామీ పేర్లతో తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి స్వాధీనం చేసుకుని అనుభవిస్తున్నారని తెలిపారు. బద్వేల్ పట్టణం, రెవెన్యూ గ్రామం, మడకలవారిపల్లె, గుంతపల్లె రెవెన్యూ గ్రామంలో పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలకు సంబంధించిన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని చెప్పారు. వీటిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నామని బహిరంగంగా ప్రకటించిందన్నారు. కొందరిపై కేసులు కూడా పెట్టారని, మిగిలిన వారిని కేసు నుంచి తప్పించు కోవడానికి ప్రభుత్వం, అధికార యంత్రాంగం అవకాశం కల్పిస్తున్నట్లు కనబడుతుందని విమర్శించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు హడావుడి చేశారని, ప్రస్తుతం ఒక్క అడుగుకూడా ముందు వేయలేదని పేర్కొన్నారు. మొదటి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం, భూ పోరాట సాధన కమిటీ ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళనలు చేస్తుంటే తమను అరెస్టు చేసి కేసులు పెట్టారని తెలిపారు. తనపైనా కేసుపెట్టారని చెప్పారు. వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. ఆక్రమించిన భూములు స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపికి చెందిన కె.వి.సుబ్బారావు, సాయికుమార్ మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామం, మైదుకూరు మెయిన్ రోడ్డుకు ఉన్న 4.28 ఎకరాల ప్రభుత్వ భూమి, శ్మశాన వాటికి ఆక్రమించి కాంప్లెక్స్ కడుతున్నారని పేర్కొన్నారు. చర్యలు తీసుకునే నాథుడే లేడని చెప్పారు. కలెక్టర్, ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి స్పందన రాలేదని తెలిపారు. 922/1లో 2.05 ఎకరాలు, 922/2లో 1.58 ఎకరాలు, 922/3లో 66 సెంట్ల శ్మశానం ఆక్రమించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఎకరా రూ.15 లక్షలు తక్కువలేదని చెప్పారు. దాదాపు రూ.60 కోట్లు ఆస్థి అన్నారు. 977/3లో 2.24 ఎకరాల స్థలం ఆక్రమించుకుని అమ్ముకుంటూ ఉంటే అనేక పోరాటాల తరువాత కట్టడాలు తొలగించి ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారని తెలిపారు. అయితే కబ్జాదారులు తొలగించినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు, కేసులు నమోచేయడం లేదని లేదని విమర్శించారు. ఫోర్జరీ,దొంగ డాక్యుమెంట్స్ డి-ఫారాలు సృష్టించి వందల కోట్ల ఆస్థి అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుని శ్మశాన భూమిని స్వాధీనం చేసుకుని, అక్రమ కట్టడాలు తొలగించాలని డిమాండ్ చేశారు. బోర్డు ప్రతిష్ఠించి, కేసుపెట్టి అరెస్టు చేయాలని కోరారు. విచారణ రెవెన్యూ అధికారులపై నమ్మకం లేదని సిబిఐ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జాదారులకు సహకరిస్తున్న రెవెన్యూ వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం శ్మశానాలు, చెరువులు, కాలువలు ఆక్రమణలు చేయటానికి వీలులేదని చెప్పారు. సమావేశంలో వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బి. నారాయణ

16 నుంచి రాష్ట్ర స్థాయి రైతు శిక్షణా తరగతులు

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపలో ఈ నెల 16,17,18 తేదీల్లో రాష్ట్ర స్థాయి రైతు శిక్షణా తరగ తులు నిర్వహి ంచను న్నట్లు ఎపి రైతు సం ఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు ప్రభా కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాతబస్టాండ్‌లోని సంఘం కార్యా లయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా వ్యవసాయ రంగం, రైతాంగం సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ నెల 16న జడ్‌పి సమావేశ మందిరంలో ప్రధానంగా 3 అంశాలపై సెమినార్లు ఉంటాయని చెప్పారు. అందులో భాగంగా వ్యవసాయ రంగం- సంక్షోభం అనే అంశంపై ఎపి రైతుసంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, 'రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు-పాలకుల వైఖరి'పై రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు బి.నారాయణ, 'విద్యుత్ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న సంస్కరణలు-రైతులపై ప్రభావం' పై విద్యుత్ రంగ నిపుణులు అశోక్‌రావు ప్రసంగిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు, శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. సంక్షోభం నుంచి రైతాంగాన్ని కాపాడేందుకు కార్యాచరణలో భాగస్వాములు కావాలని కోరారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు బి.నారాయణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలు చేతికివ స్తున్నాయని, ధరలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేరుశనగ కాయలకు కనీస మద్దతు ధరకంటే వెయ్యి రూపాయలు తక్కువకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొను గోలు చేసి రైతాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. రైతంగా సమస్యలపై నిర్వహించే సదస్సు జయప్రదం చేయడంతో పాటు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు గోపాలకృష్ణయ్య, బి.దస్తగిరిరెడ్డి, నాయకులు పాపిరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పవన్ కల్యాణ్‌కు భద్రత పెంచాలి

పోరుమామిళ్ల: జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు జెడ్ కేటగిరి భద్రత నియమించాలని జనసేన అధ్యక్షులు శీలంశెట్టి లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని జనసేనా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలు భ్రష్టుపట్టిందని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ప్రజా సమస్యలు తెలుసుకుని వారికి భరోసాగా ఉండడం, ఆర్థిక సాయం చేయడం తప్పుగా భావించి చంపుతామని బెదిరించడం దారుణమన్నారు. సిద్ధవటం బహిరంగ సభకు వచ్చిన సందర్భంగా సభలో సఫారీలు రెక్కీ నిర్వహించి ఒక పెద్ద ఎత్తున కుట్ర చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆయనకు భారీ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కడప జిల్లా ఉమ్మడి జన సేన ప్రోగ్రాం కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనువాసులు, దేవి రెడ్డి జయరామయ్య, సుబ్బు, కిరణ్ కుమార్, ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలి

చెన్నూరు : మండలంలో ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో వంట ఏజెన్సీ తయారు చేసే భోజనంతోపాటు ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడూ పరిశీలి ంచాలని ఎంఇఒ స్టెల్లా షర్మిల రాణి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో పాఠశాలలకు రంగు మారిన, గుడ్లు చెడిపోయిన గుడ్లు ఏజెన్సీ వారు సరఫరా చేయడంపై శుక్రవారం మధ్యాహ్నం చెన్నూరు ఎంఆర్‌సి కార్యాల యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాలలకు బియ్యం, కంది బేడలు, గుడ్లు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను పరిశీలిస్తుండాలని కోరారు. వంట ఏజెన్సీ వారు వంట ఎలా చేస్తున్నారు పరిశీలించాలని పేర్కొన్నారు. వంట ఏజెన్సీలో ఏవైనా లోటు పాట్లు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలకు నాణ్యత కలిగిన గుడ్లను వాహనాల ద్వారా పాఠశాలలకు చేర్చామని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వంట ఏజెన్సీ ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండా లని కోరారు. సమావేశంలో చెన్నూరు బాలుర ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాల, కొండపేట, రామనపల్లి, చిన్నమాచుపల్లి హెచ్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నఎంఇఒ స్టెల్లా షర్మిల రాణి

8 నుంచి పీజీ 4వ సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల్లో ఎంఎ, ఎంకామ్, ఎంఎస్సి, ఎంపిఇడి 4వ సెమిస్టర్ చదివే విద్యార్థులకు ఈనెల 8 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ యన్. ఈశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి పేపరు 8వ, రెండో పేపరు 10న, మూడో పేపరు 14న , నాలుగో పేపరు 16న అయిదో పేపరు 18న ఉంటాయని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలలోని శాఖల్లో హాల్ టికెట్లు పొందాలని తెలిపారు.

బతికుండగానే చంపేశారయ్యా...!

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని రెడ్డిపల్లెకు చెందిన బి.లక్ష్మి దేవిని బతికుండగానే అధికారులు చంపేశారు. అదేదో హత్య చేసి కాదు.. రికార్డుల్లో.. వివరాలు.. లక్ష్మి దేవి కొన్నేళ్ల వరకు వృద్ధాప్య పింఛను తీసుకుంటూ ఉండే వారు. ఒకటిన్నర సంవత్సరంగా ఆమెకు పింఛన్‌తో సహా ఎలాంటి పథకాలు అందలేదు. గతంలో ఆమెకు కొత్త రేషన్‌కార్డు, పింఛన్ పాసు పుస్తకం ఇచ్చారు. ప్రస్తుతం ఎలాంటి పథకాలు, పింఛన్ రాకపోవడంతో సంబంధిత వాలంటీర్‌ను అడిగారు. పొంతన లేని సమాధానం చెబుతుండడంతో ఆమె శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ రమణమ్మకు విన్నవించారు. ప్రస్తుతం 586109 ఐడి నంబర్‌పై వచ్చే పింఛన్ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మార్లు ఇకెవైసి చేయించుకున్నానని పేర్కొన్నారు. సచివాలయంలో తాను చనిపోయినట్లు నమోదు చేశారని, దీని వల్ల పింఛను రాలేదని వాపోయారు. ఎంపిడిఒ, విఆర్‌ఒను, వాలంటీర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సచివాలయ సిబ్బంది చేసిన తప్పిదం వల్లే తనకు పథకాలు రావడం లేదని పేర్కొన్నారు. అధికారులే విచారించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

'ఉక్కు'ను సాధించే వరకూ పోరాటాలు

దేశ రాజధానిలో డివైఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి కడప అర్బన్

కడప జిల్లా లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసే వరకు పోరాటాలు సాగిస్తూనే ఉంటామని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ తెలిపారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో బిజెపి విభజన హామీలు అమలు చేయాలని దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. అధికారంలోకి రావడానికి అనేక భూటకపు హామీలు ఇచ్చిందని విమర్శించారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి గడిచిన ఇన్ని సంవత్సరాలు అవుతున్నా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి ఉక్కు కోసం పోరాడటం లేదని విమర్శించారు. గడిచిన పార్లమెంటు సమావేశాలలో కూడా ప్రస్తావన చేయకపోవడం శోచనీయమని వాపోయారు.ఓట్లేసి గెలపించిన ప్రజల కోసం ఎం చేశారని ప్రశ్నించారు. కడప ఉక్కు కోసం మన ప్రాంత ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆందోళన ఆరంభం మాత్రమే అన్నారు. ఉక్కు సాధించేంత వరకు నిర్విరామ పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్ రాజ్,రాజు,రాజేంద్ర,సురేష్ పాల్గొన్నారు.



జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు


సిపిఎస్ సదస్సును జయప్రదం చేయండి

కడప అర్బన్ : సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సదస్సు ఈనెల 6న ఉదయం పది గంటలకు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్నామని, ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధన విజయ్ కుమార్ పాలెం మహేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా హాజరవుతారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి రాకమునుపు వారంలోనే సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చినా రద్దు చేయక పోవడం దారుణమి వాపోయారు. ప్రస్తుత ముఖ్యమంత్రి తాను అధికారంలోకి రాకమునుపు ఇచ్చిన హామీకి అనుగుణంగా పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. పాత పెన్షన్ సాధించుకోవడానికి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణతో పాటు నూతన సిపిఎస్ కార్యవర్గాన్ని కూడా ఈ సదస్సులో ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాలోని సిపిఎస్,ఒపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు.

డ్రై డే తప్పక పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన

గ్రామాలలో మన ఇంటి పరిసర ప్రాంతాలలో ఉన్న మురుగునీరు తొలగించి డ్రైడే పాటించి వ్యాధుల భారీ కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఆరోగ్య సిబ్బందితో కలిసి మండల కేంద్రమైన నరసాపురంలోని రంగారెడ్డి వీధిలో నిల్వ ఉన్న మురుగునీటి ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల లార్వా దోమ అభివృద్ధి చెంది గుడ్లు పెట్టి పిల్లలచేసి డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరా లను వ్యాపింపజేస్తాయన్నారు. ప్రతి శుక్రవారమూ ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామా ల్లో తిరిగి పరిసరాలు పరిశీలించి ఇళ్లల్లో ఉన్న తొట్లను కూడా పరిశుభపరు చుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్బరాయుడు, పబ్లిక్ హెల్త్ నర్స్ శారద, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, నాగమణి ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు



మురుగునీటిని పరిశీలిస్తున్న ఆరోగ్య సిబ్బంది

దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభం

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పరిణితి లేని భారతీయ జనతా పార్టీ పాలన వల్ల దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభం ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ కార్యదర్శి వి.శివ నారాయణ అధ్యక్షతన సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ స్వతంత్ర ఆర్థిక విదేశాంగ విధానాలను బిజెపి గాలికి వదిలేసిందని ఆరోపించారు. అభివృద్ధి రాజకీయాలు పక్కన పెట్టి స్వార్థ రాజకీయాలు బిజెపి తెరలేపిందని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రతీకార స్వార్థ రాజకీయాలు చేస్తోందని చెప్పారు. ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు. దేశంలో లౌకిక ప్రభుత్వాలు ఏర్పాటుకు కృషి చేయడమే సిపిఎం తక్షణ కర్తవ్యం అన్నారు. కష్టజీవుల పక్షాన కార్మికుల పక్షాన ఉద్యోగ ఉపాధ్యాయుల పక్షాన ధైర్యంగా నిలబడి పోరాడే ఏకైక పార్టీగా సిపిఎం నేడు నిలిచిందని వారు తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు జి.ఏసుదాసు, విజయ్, వినయ్, లక్ష్మీనారాయణ, నరేంద్ర, మాబాష, దివాకర్, రఘు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

పిహెచ్‌సిని సందర్శించిన కృష్ణబాబు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎం.టి. కృష్ణబాబు, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ నివాస్ శుక్రవారం సందర్శించారు. ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయని అక్కడున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సకాలంలో విధులు నిర్వహిస్తున్నారా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అని ఆరా తీశారు. బయోమెట్రిక్, ఫేషియల్ యాప్‌ను ఆస్పత్రి సిబ్బంది సక్రమంగా వేస్తున్నారా, లేదా, మధ్యలో బయటకు వెళ్తున్నారా అని అక్కడి రోగులను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, ఫార్మసిస్ట్ , కాన్పుల గదిని పరిశీలంచి సాధ్యమైనంతరవకు కాన్పులు పిహెచ్ పరిధిలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం బుగ్గలపల్లె పంచాయతీలోని వైఎస్ఆర్ హెల్త్ క్లీనిలో ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ రాఘవేంద్ర విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అక్కడికి వచ్చిన ప్రజలను విచారించారు. అక్కడే ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందకి తగు సలహాలు సూచనలిచ్చారు. మండల పిహెచ్ డాక్టర్ శైలజను, బుగ్గలపల్లె వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ రాఘవేంద్రను ప్రశంసించారు. ఆయన వెంట జెసి సాయికాంత్‌వర్మ డిఎంహెచ్ఒ నాగరాజు, అడిషన్ డిఎంహెచ్ఒ ఖాదర్ బాషా, డాక్టర్ రామిరెడ్డి, తహశీల్దార్ గంగయ్య, వైద్యులు లక్ష్మీకర్, సునీల్ కుమార్ నాయక్, ఆస్పత్రి సూపర్‌వైజర్ మోహన్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎం.టి. కృష్ణబాబు

శివానందరెడ్డి విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి కడప అర్బన్

కందుల గ్రూప్ విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే విద్యా, పారిశ్రామికవేత్త కందుల శివానంద రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా కళాశాల కెఎస్ఆర్ ఫూట్ ప్రాంగణంలో శుక్రవారం కుటుంబ సభ్యులు విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, ట్రెజరరీ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ తమ మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళతామని పేర్కొన్నారు. కళాశాల అభ్యున్నతికై అహర్నిశలు కృషి చేశారని పేర్కొన్నారు. తనయులు ముందుండి ప్రత్యేక చొరవతో అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని చెప్పారు. శివానందరెడ్డి జ్ఞాపకార్థం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, భోగా పార్వ తమ్మ బ్లడ్ బ్యాంక్, రిమ్స్ కడప సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 165 మంది రక్తదానం చేశారు. అయన జ్ఞాప కార్థం బిటెక్ మెరిట్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రూ. 5 వేలు అందజేశారు. అనంతరం ఆజాద్ నగర్ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎమ్‌డి కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు రామ మునిరెడ్డి, వైసీపీ నాయకులు అఫ్జల్ ఖాన్, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో, రాజంపేట పార్లమెంట్ సభ్యులు శ్రీనివాసులురెడ్డి మిత్రులు, శ్రేయోభిలాషులు, పలువురు రాజకీయ నాయకులు, కెఒఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ వెంకట శివారెడ్డి, సెక్రటరీ లిఖిత రెడ్డి, ప్రిన్సిపాళ్లు, వివిధ విభాగాల అధిపతులు, బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ ప్రెసిడెంట్ చిన్న ఓబుల్ రెడ్డి, జనరల్ సెక్రటరీ .ఎం. వెంకటరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి, రిమ్స్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జె.సురేష్ బాబు, కళాశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



కందుల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

నాసిరకం గుడ్ల సరఫరాపై అధికారుల ఆగ్రహం!

ప్రజాశక్తి-చెన్నూరు

రంగు మారిన, గుడ్లు కుళ్లిన గుడ్ల సరఫరాపై జిల్లా అధికారులు సంబంధిత ఏజెన్సీపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు మండల స్థాయి ఐసిడిఎస్ అధికారులపైనా, ఎంఇఒ పైనా, గుడ్లను సరఫరా చేసే ఏజె న్సీపైనా అస హనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశా లలు, అంగన్వాడీ కేంద్రా ల్లో రంగుమారిన, కుళ్లిన గుడ్లు పిల్లలకు ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. దీంతో ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నఫలంగా నిలుపుదల చేశారు. ఇలాంటి సంఘటనను పునరావతం కాకుండా స్థానిక అధి కారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు హెచ్చరించినట్లు తెలిసింది. గుడ్ల ఏజెన్సీ వారిని మందలించడంతో గుడ్ల ఏజెన్సీ వారు వాహనాల ద్వారా గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు నాణ్యమైన గుడ్లను అంగన్వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేశారు. రంగుమారిన, కుళ్ళిపోయిన గుడ్లను వెనక్కి తీసుసుకెళ్లారు. అంగన్వాడి కేంద్ర కార్యకర్తలు, పాఠశాలల వంట ఏజెన్సీ వారు గుడ్ల ఏజెన్సీ వారిని నిలదీయగా పొరపాటు జరిగింది.. తప్పయిందని మొరపెట్టుకున్నారు. కానీ పిల్లలు తల్లిదండ్రులు మాత్రం గుడ్ల ఏజెన్సీని రద్దుచేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెన్నూరు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు సంబంధం లేకపోయినా విద్యాశాఖఅధికారులు మెమోజారీ చేయడంపై భగ్గుమంటున్నారు. గుడ్లు ఏజెన్సీపై చర్యలు తీసుకోకుండా ఉపాధ్యాయులకు మెమో జారీ చేయడంపై విద్యాశాఖ అధికారులకు తగదని ఆవేదనవ్యక్తం చేశారు.



కుళ్లిన గుడ్ల స్థానంలో నాణ్యమైనవి సరఫరా

అక్రమ అరెస్టులపై ఎస్‌పికి ఫిర్యాదు

కడప అర్బన్

ప్రొద్దుటూరులో పోలీసుల అక్రమ కేసులు, అరెస్టులపై బాధితులతో కలిసి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి ఎస్‌పి అన్బు రాజన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి అరాచకాలు రోజురోజుకూ పరాకాష్టకు చేరుకున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెస్తే కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. అక్రమ అరెస్టులపై కోర్టు చివాట్లు పెట్టే పరిస్థితికి పోలీసులు తీసుకొని రావద్దని కోరారు. రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతునొక్కడం కోసం వైసిపి ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తుందని పేర్కొన్నారు. ఎస్‌పిని కలిసిన వారిలో ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి భార్య, టిడిపి మైనార్టీ నాయకులు ముక్తియార్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు జియావుద్దీన్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

ఎల్ఐసిలో వ్యాసరచన పోటీలు

కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, శుక్రవారం ఎల్ఐసి కా ర్యాల య ఆవ రణలో 'విజిలెన్స్ అవేర్నెస్ వీక్' కార్య క్రమం లో భా గంగా వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో నగరం లోని నాలు గు కళాశాల నుంచి 33 మంది విద్యార్థులు హాజరయ్యారు. 'అవినీతి నిరోధంలో సవాళ్లు' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్సనల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పిలుపుమేరకు అక్టోబర్ 31 నుంచి నవంబర్ 6 వరకు విజిలెన్స్ అవేర్నెస్ వీక్‌ను ఎల్ఐసి సంస్థ పాటిస్తోందన్నారు. అందులో భాగంగానే వ్యాసరచన ఏర్పాటు చేశామన్నారు. ఏ దేశమైనా బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే అది అవినీతిరహిత పునాదుల మీదనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ చైతన్యాన్ని, అవగాహనను రేపటి పౌరులైన నేటి విద్యార్థుల్లో కల్పించడం కోసం ఈ అంశాన్ని ఎంపిక చేశారని అన్నారు. వ్యాసరచన పోటీ నిర్వహణ కార్యక్రమంలో పర్సనల్ విభాగం అధికారులు లక్ష్మీనారాయణ రెడ్డి, సాహెబ్ పీర్ పాల్గొన్నారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గడువులోపు పూర్తి చేయాలి : ఒఎస్‌డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పనులను గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మోడల్ టౌన్‌లో భాగంగా ఉలిమెళ్ల చెరువు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ దేవిరెడ్డి ప్రవీణ్‌కుమార్ రెడ్డితో మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు.


పనులను పరిశీలిస్తున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

నిబంధనల మేరకు పనిచేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు పని చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. విజిలెన్స్ విభాగంపై శుక్రవారం వారు మున్సిపల్ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ మున్సిపల్ సిబ్బంది చేత ప్రభుత్వ ఆదేశానుసారం పనిచేస్తామని ప్రమాణం చేయించారు.


సిబ్బందితో ప్రమాణం చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

స్వచ్ఛ పులివెందులగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులను స్వచ్ఛతగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పురపాలక చైర్మన్ వల్లపు వరప్రసాద్ కోరారు. స్థానిక వివేకానంద స్వామి బ్రాంచి స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు మునిసిపల్ చైర్మన్, అధికారులు పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. సోషల్ మీడియాకు సంబంధించి తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్య క్రమంలో పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ వివి నరసిం హారెడ్డి, సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపల్ గీత, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకూ అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి మహిళకు తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, శానిటేషన్ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు కోరారు. పట్టణంలోని స్థానిక పెద్ద కొండప్ప కాలనీ సచివాలయం పరిధిలో శుక్రవారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళ పొడి, తడి చెత్తను వేర్వేరు బుట్టలో ఉంచి చెత్త సేకరణ వాహనానికి అందించాలన్నారు. నిబంధనల ప్రకారం ఆకుపచ్చ రంగు బుట్టలో తడి చెత్తను, నీలం రంగు ప్లాస్టిక్ బుట్టలో పొడి చెత్తను, ఎరుపు రంగు బుట్టలో హానికర వ్యర్థాలను వేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డిఇ గురప్ప యాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకోవడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

అనాథ వృద్ధులను ఆదుకోవడం హర్షణీయమని బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళ్లాయప్ప తెలిపారు. ఆయన అల్లుడు శివప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం పాత గండి రోడ్డులో ఉన్న మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వారి మధ్య కేక్ కట్ చేసి స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంబూరు స్నేహ లత, నంబూరు సుదర్శన్, ఎన్.సాయి, ఎన్. శ్రీధర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


వృద్ధులకు అన్నదానం చేస్తున్న కుళ్లాయప్ప కుటుంబ సభ్యులు

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటలో వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం శుక్రవారం సర్పంచు కె.గురుఈశ్వర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ రూ.55 లక్షలతో గండికోటలో వాటర్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. గ్రామ ప్రజల కోసమే కాక ఎంతో మంది పర్యాటకులను కూడా దృష్టిలో పెట్టుకుని టూరిజం పక్కన ఈ ట్యాంకును నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ మోహన్, ఎఇ నర్సింహులు, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.


భూమిపూజకు హాజరైన సర్పంచు, అధికారులు

క్రైం కార్నర్

దాడి కేసులో జైలుశిక్ష, జరిమానా

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామానికి చెందిన ఎద్దుల ఉత్తయ్యపై దాడి చేసిన కేసులో అరిగేల కొండయ్య(చిన్న బాబు)అనే వ్యక్తికి రెండేళ్ళు జైలు శిక్ష, మరో ఇద్దరికి ఏడాది పాటు జైలు శిక్షను పులివెందుల మెజిస్ట్రేట్ ఎం. పవన్‌కుమార్ విధించినట్లు ఆర్‌కె వ్యాలీ ఎస్ఐ రంగరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు.. వీరన్నగట్టుపల్లి గ్రామానికి చెందిన ఎద్దుల ఉత్తయ్యకు అదే గ్రామానికి చెందిన అరిగేల కొండయ్య (చిన్న బాబు) అరిగెల బాబు, అరిగేల కొండయ్య అనే వారు 2015లో పొలం దగ్గర ఉన్న కాలవ గట్టు విషయమై గొడవపడ్డారు. ఆ విషయం మనసులో పెట్టుకొని వీరన్నగట్టుపల్లి క్రాస్ రోడ్డు దగ్గర పైన పేర్కొన్న ముగ్గురు ఎద్దుల ఉత్తయ్యపై దాడి చేసి గాయపరిచారు. ఆ మేరకు ఉత్తయ్య భార్య ఎద్దుల లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసి విచారించారు. అనంతరం జెఫ్ సిఎం పులివెందుల కోరులో చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శుక్రవారం పులివెందుల కోర్టులో వాదనలు విన్న మెజిస్ట్రేట్ నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులకు శిక్ష ఖరారు చేసి, వారిలో ఎ1 అయిన అరిగేల కొండయ్య(చిన్న బాబు)కు రెండేళ్ళ జైలు శిక్షతోపాటు రెండు వేలు జరిమానా విధించారు. మిగిలిన ఎ2 అరిగేల బాబు, ఎ3 అరిగేల కొండయ్యకు ఏడాది జైలు శిక్షతోపాటు ఒకొక్కరికి రెండు వేలు చొప్పున జరిమానా విధిస్తూ శిక్ష ఖరారు చేసినట్లు ఎస్ఐ వివరించారు.


శిక్ష పడినవారితో పోలీసు

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి - మైలవరం

ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జమ్మలమడుగు రూరల్ సిఐ కొండారెడ్డి హెచ్చరించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన తలమంచిపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న కొమెర్ల గ్రామంలో కార్డెన్ సెర్చ్ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామంలోని అనుమానిత ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశామన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తేవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపీనాథ్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అయా ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదమైన ఇళ్లను కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలు, నాటుసారా విక్రయాలు చేపట్టరాదని చెప్పారు. పేకాటకు దూరంగా ఉండాలని కోరారు. నాటుసారా కేంద్రాలు ఏర్పాటు చేస్తే అలాంటి వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని సిఐ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠన చర్యలు తీసుకుంటామని పులివెందుల సిఐ మద్దిలేటి తెలిపారు. మండలంలోని కోమన్నూతల గ్రామంలో శుక్రవారం నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్ళు, కల్లాలు తనిఖీ చేశారు. అనంతరం సిఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఫ్యాక్షన్ వల్ల పిల్లల చదువులు ఆగిపోయి, వారి భవిష్యత్ అంధకారం అవుతుందని వివరించారు. గతేడాది సర్పంచు మునెప్పను ప్రత్యర్థులు హత్య చేశారు. అప్పటి నుంచి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తెస్తే పరిష్కార మార్గం చూపుతామన్నారు. కార్యక్రమంలో సింహాద్రిపురం, తొండూరు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


మైలవరం : చిన్నకొమెర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


వేంపల్లె : మురుగు నీటిలో మందు చల్లుతున్న ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దముడియం

విష జ్వరాలైన మలేరియా, టైఫాయిడ్ వంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని జమ్మలమడుగు మలేరియా యూనిట్ అధికారి బి. సుబ్బరాజ తెలిపారు. గుండ్లకుంట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం బాలికలకు కంటి, దంతాల పరీక్షలు నిర్వహించారు. ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డెంటల్ డాక్టర్ ఎస్.అనూష దంత పరీక్షలు చేశారు. వద్దిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేత్ర వైద్య అధికారి సత్యనారాయణ కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజ విద్యార్థులకు దోమకాటు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. 48 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు నిర్ధారించారు. వీరికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కంటి సంబంధిత సాధారణ వ్యాధులతో ఉన్నవారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ప్రభావతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె : దోమల నివారణకు పరి సరాల పరిశుభ్రత ముఖ్యమని పులివెందుల సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య సూచించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మం డలంలోని మిట్టపల్లె గ్రామంలో ఆరోగ్య సిబ్బంది మురికి నీరు నిల్వలు ఉన్న చోట పైరిత్రం పిచికారీ చేసి ఫీవర్, లార్వా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచరాదన్నారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయని వివరించారు. మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ లక్ష ణాలు ఉంటే పులివెందుల ఏరియా ఆస్పత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరత్నం, సూపం్‌వైజర్ వెంకటలక్షుమ్మ, ఆరోగ్య కార్యకర్త నాగ స్వర్ణమ్మ, ఆశా కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి కుటుంబానికి ఒక వైద్యుడ్ని ఏర్పాటు చేసిందని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. మండలంలోని మాదన్నగారిపల్లె గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ కరిష్మా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ శాంతికళ సందర్శించి, డాక్టర్ కరిష్మాతో కలిసి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మహదేవ, సూపర్‌వైజర్ శోభాకుమారి, ఎంపిహెచ్ఎస్, ఎంఎల్‌హెచ్‌పి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీతో కార్మికుల ధర్నా విరమణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హామీతో ఆర్‌టిపిపిలో కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన ధర్నాను విరమించారు. ఆర్‌టిపిపిలో భూములు కోల్పోయి ఉద్యోగాలు రానివారు, అక్కడ పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. 600 మెగావాట్ల కర్మాగారం మెయిన్ గేట్ ఎదుట కూర్చొని ఎవ్వరిని లోనికి పంపకుండా ధర్నా నిర్వహించారు. భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా, కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయకుండా, నెల్లూరు థర్మల్ ప్లాంట్ నుంచి 39 మందిని ఎలా చేర్చుకుంటారని ఆందోళనకారులు ప్రశ్నించారు. వారిని చేర్చుకుంటే మాకు కూడా ఉద్యోగాలు ఇవ్వాలని, అలాగే కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న స్థానంలోనే యథావిధిగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. ముందుగా సిఐ మోహన్‌రావుతో చర్చించారు. అనంతరం ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులతోనూ చర్చించారు. ఆందోళనకారులు వారి డిమాండ్లను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జెన్‌కో అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ, జెన్‌కో ఎండితో మాట్లాడుటకు మూడు రోజులు గడువు ఇవ్వాలని, తాను కూడా ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మూడు రోజుల తర్వాత ఇదే పరిస్థితి ఎదురైతే మళ్లీ ఆందోళన చేపట్టవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.


ఆందోళకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధికి టిడిపిని ఆదరించాలి


మహిళలను పలుకరిస్తున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని పెద్ద పసుపుల గ్రామంలో శుక్రవారం టిడిపి నాయకులు రెండవరోజు బాదుడేబాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి దేవగుడి భూపేష్ సుబ్బరామిరెడ్డి ముందుగా గ్రామంలోని మాధవరాయ స్వామి, శివాలయాలను సందర్శించారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికెళ్లి వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలను జగన్ ప్రభుత్వం అన్నివిధాల మోసం చేసిందని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావాలన్నారు. 2023 మార్చి నెలలో జరుగు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు ఓటు నమోదు సోమవారంతో ముగియనుందన్నారు. పట్టభద్రులంతా ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జాంబాపురం రమణారెడ్డి, పెద్దపసుపల నాయకులు ముద్దన మల్లారెడ్డి, పుల్లారెడ్డి, కొండారెడ్డి, రాఘవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సారాయి పుల్లారెడ్డి, రాజేష్‌రెడ్డి, శ్రీకాంత్, నాగరాజ్ యాదవ్, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు కృషి

చిన్నమండెం : యువతను, నిరుద్యోగులను చైతన్యవంతులను చేసి ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కృషి చేద్దామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు సురేంద్రబాబు, శివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొత్తమాదిగపల్లెలో ఎంఆర్‌పిఎస్ రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండకింద మనోహర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామ స్థాయి నుంచి చదువుకున్న యువత, నిరుద్యోగులు ఉద్యమంలో భాగస్వామ్యమై ఎస్సీ వర్గీకరణ సాధనకు నడుంబిగిద్దామని పేర్కొన్నారు. పిడీత కులాలను, అణగారిన వర్గాలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల ఎంఆర్‌పిఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నేడు విశ్వనాథరెడ్డి ప్రమాణం

ప్రజాశక్తి - రామాపురం

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శనివారం కర్ణపు విశ్వనాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక వైసిపి కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కార్యాలయంలో నిర్వహించనున్న విశ్వనాథ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్పర్సన్ జకియాఖానం, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్‌రెడ్డి, ఎంఎల్‌ఎ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంఎల్‌ఎలు మేడా మల్లికార్జున్ రెడ్డి, చింతల రామచంద్రరెడ్డి, ద్వారనాథరెడ్డి, మహమ్మద్ నవాజ్‌బాష, కడప మేయర్ సురేష్ బాబు హాజరు కానున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

రాయచోటి : అన్నమయ్య జిల్లా గ్రామ రెవెన్యూ అధి కారుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం రాయ చోటి ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు యెూగాంజనేయరెడ్డి, మదనపల్లి డివిజన్ అధ్యక్షులు హేమాంబ రెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

పోటీలకు సిబిఐటి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

తిరు పతి విద్యా నికేతన్, నంద్యాల శాంతిరాం కళాశాలలో నిర్వహించిన సౌత్ జోన్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలలో సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఆయన విద్యా ర్థులను అభినందించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ కబడ్డీ పోటీలో జి వెంకట నాగలక్ష్మి, వై చరిత, బాల్ బ్యాడ్మింటన్‌లో నాగ ధరణి సౌత్ జోన్‌కు ఎంపిక కాగా.. ఎం.పవన్ ఆల్ ఇండియా లెవెల్‌కు ఎంపికయ్యారని తెలిపారు. తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల కళాశాల యాజమాన్యం అభినందించింది. ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్

రాష్ట్రంలో తాలిబన్ల పాలన : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో రాజహింసతోపాటు తాలిబన్ల పాలన కొనసాగుతున్నట్లు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి తెలిపారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడ్ని సిబిసిఐడి పోలీసులు అరెస్టు చేసిన విధానం అప్రజాస్వామికమన్నారు. తెల్లవారుజామున గోడ దూకి, గేట్లు విరగ్గొట్టి 200 మంది సిఐడి పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి, దుస్తులు మార్చుకునే అవకాశం ఇవ్వకపోవడం అమానుషమన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాదులను, కరుడుగట్టిన మావోయిస్టులను కూడా ఇలా అరెస్టు చేయరని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఆరాచకాలను, అవినీతిని ప్రశ్నించే గొంతును నొక్కాలని చూడడం ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదని తులసిరెడ్డి హెచ్చరించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. జగన్ ప్రభుత్వం ప్రతి నెలా జీతాలు సకాలంలో ఇవ్వక పోవడం పరిపాటిగా మారిందన్నారు. ఈనెల జీతాలు ఇప్పటి వరకు 60 శాతం మేరకు పడకపోవడం శోచనీయమన్నారు. ఇందుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేక పోవడమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అని సిఎం జగన్, వైసిపి నాయకులు వ్యాఖ్యానించడం విడ్డూరమన్నారు.

'కందుల' సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ మంత్రి కందుల శివానందరెడ్డి సేవలు అదర్శనీయమని స్థానిక ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాదరావు పేర్కొన్నారు. కందుల శివానందరెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఐటిఐలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టెక్నికల్ విద్యను పేద విద్యార్థులకు అందిం చడానికి కందుల ఐటిఐని ఏర్పాటు చేశారన్నారు. ఐటిఐ అధ్యాపకులు అమర్నాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్ నాయుడు, ఉత్తమారెడ్డి, నర్సింహారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


శివానందరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్

వైసిపి ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

దేశంలోనే విద్యలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్ ఉందని, తొలిసారి కేంద్రం విడుదల చేసిన సర్వేలో లెవెల్-2లో ఎంపికైందని వైసిపి జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ షాహీద్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యా వ్యవస్థలో సంచలన మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. గత మూడేళ్లలో విద్యారంగానికి రూ.53 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. వైసిపి విద్యార్థి విభాగం నాయకుడు అబ్దుల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు మహర్దశ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎంఎల్‌ఎ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని బేతల్ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు.వాటర్ ప్లాంట్, వంటశాల, భోజనం తయారీలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో విద్యాబోధనలపై చర్చించారు. ఏ మీడియంలో చదవడం ఇష్టమని విద్యార్థులను శ్రీకాంత్ రెడ్డి అడగడంతో ఇంగ్లీష్ మీడియమని విద్యార్థులు ముక్తకంఠంతో చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. వచ్చే శుక్రవారం మళ్లీ తాను పాఠశాలకు వచ్చి రాయచోటిపై వ్యాస రచన పోటీలు పెడతానని, అందుకు అందరూ సిద్ధం కావాలని ఆయన విద్యార్థులకు సూచించారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి శనిఆవరం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9:30 గంటలకు కడప నుంచి రోడ్డు మార్గాన్ని బయలుదేరి రామాపురం చేరుకుంటారున్నారు. అక్కడ నిర్వహించే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం రాయచోటికి చేరుకుంటారున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా సమీక్ష కమిటీలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక సాయి శుభం కళ్యాణ మండపంలో నిర్వహించే అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.



నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాక

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9:30 గంటలకు కడప నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి రామాపురం చేరుకుంటారున్నారు. అక్కడ నిర్వహించే వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం రాయచోటికి చేరుకుంటారున్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా సమీక్ష కమిటీలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక సాయి శుభం కళ్యాణ మండపంలో నిర్వహించే అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. తరువాత అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు

కలెక్టర్ గిరీష, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి



మహిళకు ఇంటి పట్టా ఇస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పీలేరు

జిల్లాలో అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నామని కలెక్టరు గిరీష, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, జెసితో పాటు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో 57,934 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. అర్హత గల పేదలకు ఇంటి స్థలంతో పాటు సొంత ఇళ్లు ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. 25 రకాల పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లోకే ముఖ్యమంత్రి ఆర్థిక సాయం అందజేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతిళ్లు ఉండాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ సమకూర్చాలని అధికారులకు సూచించారు. పీలేరు పట్టణంలో 9,375 మందికి ఇంటి పట్టాలు ఇచ్చామని, రూరల్ ప్రాంతంలో 3,409 మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేశామన్నారు. ప్రజలు గత ప్రభుత్వం పాలన, ఈ ప్రభుత్వ పాలనకు మధ్య తేడా గుర్తించాలని కోరారు. మేనిఫెస్టోలో ఉన్న అన్ని పథకాలూ అమలౌతున్నాయన్నారు. ప్రజలు గత ప్రభుత్వం పాలన, ఈ ప్రభుత్వ పాలనకు మధ్య తేడా గుర్తించాలని కోరారు. మేనిఫెస్టోలో ఉన్న అన్ని పథకాలూ అమలవుతున్నాయన్నారు. పీలేరు పట్టణంలో అన్ని వసతులతో కూడిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగు తున్నాయని, త్వరలో దాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. పట్టణానికి సంబంధించి బైపాస్ రోడ్డుకు టెండర్లు పూర్తి చేసి, భూ సేకరణ జరిగిందన్నారు. పీలేరు పట్టణ ప్రజల తాగు నీటి సమస్య తీర్చడానికి కడప జిల్లా నుంచి పైప్ లైన్ ద్వారా నీటిని రప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాలకు నీళ్లు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. పట్టణ ప్రజల కోసం స్మశాన వాటిక, పార్కులను ఏర్పాటు చేయడం జరిగిందని, పట్టణంలో వాటర్ ప్లాంట్లు పెట్టి ఉచిత మినరల్ వాటర్ ప్రజలకు ఇస్తున్నామన్నారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఊరికి నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. నేషనల్ హైవేలో ఇళ్లు కోల్పోయిన వారికి ఎపిఐఐసిలో ఇంటి పట్టా ఇస్తామని హామీ ఇచ్చారు. నవరత్నాల్లో చెప్పినవే కాకుండా చెప్పని సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలకు అందిస్తున్నారన్నారు. పేద ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ జగనన్నకు ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ రంగ స్వామి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, హౌసింగ్ డైరెక్టర్ భాస్కర్ నాయుడు, పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఎంపిపి కంభం సతీష్‌కుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి రత్నశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు అబ్దుల్‌కలీం పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో..?

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టని పాలకులు, అధికారులు



గుంతలమయంగా మారిన పొట్టిరెడ్డిగారిపల్లె రోడ్డు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గ్రామీణ రహదారులన్ని గుంతలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్డు, సంబేపల్లి మండలం దూద్యాల గ్రామంలోని పొట్టిరెడ్డి గారి పల్లి, దేవపట్ల నుంచి ఎర్ర దిన్నల బిడికి, కొత్త మాదిగ పల్లి రహదారుల సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుండుపల్లి రోడ్ పనులు కూడా నత్తనడకన సాగుతోంది.గాలివీడు మండలం చీమల చెరువు పల్లి గ్రామంలో ఎర్ర దొడ్డి పల్లి రోడ్డు మరమ్మతులు కోసం తవ్వి వదిలేశారు. కెవి పల్లి మండలం సందల గుట్టపల్లికి సరైన రహదారి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లన్నీ గుంతలమవ్వడంతో ఉండటంతో ఎక్కడికి వెళ్ళాలన్నా సమయం వృధా అవుతోందని పలువురు వాపోతున్నారు. రోడ్డు గుంతలు గుంతలుగా ఉండటంతో విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు, పాము కాటుకు గురైనవారు, దీర్ఘకాలిక రోగులు గ్రామీణ ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి వైద్య పరీక్షల నిమిత్తం తిరిగి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు ప్రస్తుత కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గుంతలు తేలి కంకరతో నడవడానికి కూడా ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇలాంటి గుంతలు పడిన రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు నడపాలంటే వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామీణ రహదారులకు మోక్షం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టి, సమస్య తీర్చాలని ప్రజలు, వాహనాదారులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



రహదారులపై గుంతలు అధికంగా ఉన్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. రహదారిపై రాత్రి సమయంలో వెళ్లాలంటే గుంతలను గుర్తించలేక ప్రమాదాలు గురవుతున్నాం. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు.. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

-బి.వేణునాయక్, ఎర్రదిన్నెలబిడికి, సంబేపల్లి మండలం.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

జిల్లాలోని దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. కొన్ని రహదారులు రహదాలలో పనులు చేస్తున్నాం.

- అరవిందదేవి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ, రాయచోటి.



తరగతి గదులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మనబడి, నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు మహర్దశను సంతరించుకున్నాయని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని తాకటమవారిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రెండో విడత నాడు-నేడు పథకం కింద మంజూరైన రూ.44 లక్షలతో పనులకు భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. అనేక పథకాల తీసుకొచ్చారని కొనియాడారు. పట్టణంలోని పాశంవీధి సింహం స్ట్రీట్ జయశ్రీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జయశ్రీ కాలనీలో 11 కె.వి విద్యుత్ వైర్లు ఇళ్ల మధ్యన ఉన్నాయని ఆ విద్యుత్ వైర్లను మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక ప్రజలు ఎమ్మెల్యేని కోరారు. వారి అభ్యంతర మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి మండల విద్యుత్ ఎఇ గిరిధర్‌తో 11 కెవి విద్యుత్ స్తంభాల్ని ఇళ్ల మధ్య మధ్య లేకుండా వెంటనే మార్చమని తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధిపై కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో నగర పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాయచోటి నియోజకవర్గం పరిశీలకుడు ఖలీల్ అహ్మద్, హౌసింగ్ సొసైటీ చైర్మన్ కంచి బలరాంరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ కళ్యాణ్ కుమార్‌రెడ్డి, హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కంచి సురేందర్ రెడ్డి, సేవాదళ్ నియోజవర్గం అధ్యక్షుడు సల్మాన్, పెన్నయ్య, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, ఎస్ఎస్.ఫయాజ్, నక్క సంతోష్, సబ్జీ, నరసింహనాయుడు, నక్క మహేష్, చాంద్‌బాషా, పవన్, ఎం.వి.కృష్ణయ్య, రాజు, రాయలసీమ రమేష్ రెడ్డి, పాగొండ షఫీ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఎంఎల్‌ఎ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని బేతల్ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. వాటర్ ప్లాంట్, వంటశాల, భోజనం తయారీలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో విద్యా బోధనలపై చర్చించారు. ఏ మీడియంలో చదవడం ఇష్టమని విద్యార్థులును శ్రీకాంత్ రెడ్డి అడగడంతో ఇంగ్లీష్ మీడియమని విద్యార్థులు ముక్తకంఠంతో చెప్పారు. క్రమశిక్షణ, పట్టుదలలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. వచ్చే శుక్రవారం మళ్లీ తాను పాఠశాలకు వచ్చి రాయచోటిపై వ్యాస రచన పోటీలు పెడతానని, అందుకు అందరూ సిద్ధం కావాలని ఆయన విద్యార్థులుకు సూచించారు. పాఠశాలకు వచ్చిన అవార్డులను పరిశీలించి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులును ఆయన అభినందించారు.

గంధోత్సవానికి ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు హాజరు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని కలిచెర్ల మౌళకపహాడ్‌లో శుక్రవారం రాత్రి కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి పీఠాధిపతి అరిఫుల్లా హుసేని ఆధ్వర్యంలో ఘనంగా గంధం ఉత్సవం నిర్వహించారు. అనతరం ఆయన హాజరత్ ఖ్వాజి సయ్యద్ గృహంలో ప్రత్యేక సదివింపులు నిర్వహించారు. గంధం ఉత్సవానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లి, రాయచోటి, పీలేరు, మదనపల్లె ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారాకనాథ్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నవాజ్ భాష, హరినాథరెడ్డి డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ హరనాథ్‌రెడ్డి, ఎంపిపి పూర్ణిమ చంద్రిక రమేష్, మండలంలోని వైసిపి నాయకులు, తహశీల్దార్ నిర్మాలదేవి, సిఐ షాదిక్ అల్లి, ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.



గంధోత్సవంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జెడిఎ



సమావేశంలో మాట్లాడుతున్న జెడిఎ ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - వీరబల్లి

గ్రామ సంఘ ఆయకట్టు రైతులు, సమాఖ్య సంఘ సభ్యులు, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం గుర్రప్పగారి పల్లి పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి స్వాతి ఆధ్వర్యంలో జలవనరుల శాఖ జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ వారి సౌజన్యంతో పెద్ద చెరువు, వీరప్ప చెరువు, ఆయకట్టు రైతులు గ్రామ సమాఖ్య సంఘాల అభివృద్ధిపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నీటిపారుదుల జీవనోపాధి అభివృద్ధి పథకం అమలుపై చిన్న తరహా నీటిపారుదల ప్రాజెక్టు పరిధిలో సంఘాలు ఏర్పాటు చేయడం, వ్యవసాయపై ఆధారపడి కుటుంబాల ఆదాయం పెంచడం, మార్కెట్ అవకాశాలను మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశం అన్నారు. ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టు, ఆధునికీకరణ వ్యవసాయం, యాంత్రికరణ, మత్స్య శాఖ అభివృద్ధి పశుగణాభివృద్ధి చేపడతారని తెలిపారు. అందులో ప్రజలను భాగస్వాములు చేసి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును ఇస్తుందని పేర్కొన్నారు. జపాన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ ఆహిద్, అగ్రికల్చర్ అధికారి స్వాతి, ఎపిఐఎల్ఐపి ప్రాజెక్ట్ ఏపీడీ మల్లికార్జునరెడ్డి, వ్యవసాయ సచివాలయ ఉద్యోగులు స్వప్న మంజునాథ, నాయకులు సర్పంచ్ భర్త బీసీ సెల్ ఈశ్వరయ్య, శ్రీరాముల రెడ్డి, సుబ్బరామరాజు, వెంకట్రాంరెడ్డి, రిసోర్స్ పర్సన్ నాగయ్య, రైతులు పాల్గొన్నారు.

నూతన భవనాలు మంజూరు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పెరుగుతున్న జనాభాకనుగుణంగా నూతన అంగన్వాడీ భవనాలను మంజూరు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ. రామాంజులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షులు వి. సిద్ధమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు మరణాల రేటు తగ్గించాలనే లక్ష్యం తో ఏర్పాటుచేసిన ఐసిడిఎస్ పట్ల భాధ్యతాయుతంగా నిధులు పెంచాలని పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించాలని, యూత్ ల భారం తగ్గించాలని తెలిపారు. నాణ్యమైన పౌష్టికాహారం, ధరలకనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ భెనిఫిట్స్ సౌకర్యం రూ. 3 లక్షలు ,గ్యాస్, కూరగాయల బిల్లులు, సెంటర్ అద్దెలు,ెఎండింగ్ జీతాలు అన్ని కలిపి ఒకొక్కరికీ రూ. 50 వేల బకాయిలు రావాలని పేర్కొన్నారు. వాటి కోసం అప్పులు చేసి మానసిక ఆందోళనలకు గురవుతున్నారని ఆవేదన చెందారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు మెనూ ధరలు పెంచాలని పేర్కొన్నారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు ఇవ్వాలన్నారు. నాణ్యమైన గుడ్లు, పాలు సరఫరా చేయాలని తెలిపారు. ఉపాధ్యక్షురాలు ఖాజాబి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షురాలు పి.రెడ్డెమ్మ, జయమ్మ, పద్మజ, విజయ, అమ్ములమ్మ, అరుణ, శంకరమ్మ, మంజుల, పద్మజ, అరుణ, ప్రవీణ, ఉమా, సురేఖ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజులు

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు : 'గడికోట'



విభిన్నప్రతిభావంతునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అర్హతే ఆధారంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలును అందించడంలోనూ, అభివృద్ధి పనులలోనూ, ఎన్నికలలో ఇచ్చిన హామీలును నెరవేర్చడంలోనూ సిఎం వై.ఎస్.జగన్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి మున్సిపాలిటీలోని 12, 7వ సచివాలయ పరిధిలో సుండుపల్లె రహదారి, బేతల్ కాలనీ, చర్చివీధి, దివ్యతేజ స్కూల్ వీధి, రెడ్డీస్ కాలనీ, రామాలయం వీధి, కుమ్మరమిట్టలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్ఎ ప్రతి ఇళ్లూ తిరిగి పథకాల అమలును వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి తెలియజేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి అందేలా అధికారులును ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలనకు ప్రజలు వంద శాతం మార్కులు వేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, దానికి అనుసంధానంగా వాలంటీర్ల వ్యవస్థల్ని తెచ్చి పరిపాలన ప్రజల ముంగిట నిలిపిన ఘనత జగనన్నదే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ,వైస్ చైర్మన్ ఫయాజ్ బాష, ఫయాజుర్ రెహమాన్, జడ్‌పిటిసి వెంకటేశ్వర రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, స్థానిక కౌన్సిలర్ మురికి నాటి లక్ష్మిదేవమ్మ, వెంకట్రామిరెడ్డి, కాల్వ వెంకట్రామిరెడ్డి, జయచంద్రా రెడ్డి, సుబ్బారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, హబీబుల్లా ఖాన్, బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున,జిన్నా షరీఫ్, కొలిమి ఛాన్ బాష, అల్తాఫ్, సుగవాసి శ్యామ్, ఆర్టీ శంకర్, జానం రవీంద్ర యాదవ్, పల్లా రమేష్, ఆనంద రెడ్డి, అజ్మతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

రాహుల్ జోడో యాత్రకు సంఘీభావం

మదనపల్లె అర్బన్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా బస్సు యాత్రను శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండ్ ఇందిరా సర్కిల్‌లో జెండా ఊపి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ఐక్యతను చాటుతూ కుల మతాలకు అతీతంగా భారత్ జోడో యాత్రను ప్రారంభించిన రాహుల్ గాంధీకి మద్దతుగా సంఘీభావంగా జోడోయాత్రలో కాశ్మీర్ వరకు ప్రయాణం చేయడానికి బస్సును ప్రారంభించామని తెలిపారు. నరేంద్ర మోడీ పాలనలో తీవ్రంగా నష్టపోతున్న పేద, మధ్య తరగతి, రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిసిసి కో-ఆర్డినేటర్ షంషేర్, బిసి సెల్ కో-ఆర్డినేటర్ వేమయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డి సాహెబ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, పట్టణ మహిళా అధ్యక్షులు రెడ్డి రఘుపతి, ఖాజా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బస్సు యాత్రను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న నరసింహ

ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణ కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని వాపోయారు. ఫీజులు మాత్రం వేలకు వేలు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తులు పెంచుకోవడం,రియల్ ఎస్టేట్ చేయడం తప్ప విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఆలోచన యాజమాన్యాలకు లేవని వాపోయారు. 20 ఏళ్లుగా నడుపుతున్న విద్యా సంస్థల్లో ఇప్పటికీ కనీస వసతులు లేవని పేర్కొన్నారు. ఏ ఒక్క పాఠశాలలోనూ క్వాలీఫై టీచర్లు లేరని పేర్కొన్నారు. ఇటువంటి పాఠశాలలపై కలెక్టర్ కొరడా ఝుళిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మదనపల్లి ప్రాంతంలో కొన్ని ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాయని పేర్కొన్నారు. కనీస నిబంధనలు పాటించని వాటిపై జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేశారు.చర్యలు తీసుకోకుంటే స్కూల్ ఎదుట ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ జిల్లా సహాయ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించనున్నట్లు రాయచోటి రెవెన్యూ డివిజన్ గ్రామ అధికారుల సంఘం అధ్యక్షులు యోగాంజనేయరెడ్డి, మదనపల్లి డివిజన్ అధ్యక్షులు హేమాంబ రెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరై జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని పేర్కొన్నారు.

పక్కా గృహాలను వేగవంతం చేయాలి : పీడీ

ప్రజాశక్తి - రామాపురం

జగనన్న పక్క గృహాలను వేగవంతం చేయాలని అన్నమయ్య జిల్లా డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మూడు మండలాలకు సంబంధించిన వెలుగు సిబ్బందికి జగనన్న పక్కా గృహాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలకు సంబంధించిన మొత్తం 2077 పక్కా గృహాలగాను. 688 పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలంలో జగనన్న పక్క గృహాలు 978 గాను 234, గాలివీడు మండలంలో950 గాను 218, రామాపురం మండలంలో 1249 గాను 236, పక్కా గృహాలు పూర్తికాగా మిగిలినవి వివిధ దశలో ఉన్నాయన్నారు. జగనన్న చేదోడు కింద రామాపురం మండలంలో 350 మందికి, గాలివీడు మండలంలో 321 లక్కిరెడ్డిపల్లి మండలంలో 418 మందికి గాను ఒక్కొక్కరికి రూ. 30 వేల చొప్పున10 89 మందికి జగనన్న చేదోడు కింద బ్యాంకు లో రుణాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐబిడి పిఎం వేణుమాదవ్, మూడు మండలాల ఎపిఎంలు రెడ్డమ్మ, నిరజంన్, రెడ్డయ్య, సిసిలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు కృషి

ప్రజాశక్తి-చిన్నమండెం

యువతను, నిరుద్యోగులను చైతన్యవంతులను చేసి ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కృషి చేద్దామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు సురేంద్రబాబు, శివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొత్తమాదిగపల్లెలో ఎంఆర్‌పిఎస్ రాయచోటి నియోవక్గర ఇన్‌ఛార్జి బండకింద మనోహర్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామ స్థాయి నుంచి చదువుకున్న యువత, నిరుద్యోగులు ఉద్యమంలో భాగస్వామ్యమై ఎస్సీ వర్గీకరణ సాధనకు నడుంబిగిద్దామని పేర్కొన్నారు. పిడీత కులాలను, అణగారిన వర్గాలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా పయనించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల ఎంఆర్‌పిఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సురేష్

పశువులకు చర్మ వ్యాధి వ్యాక్సిన్ తప్పనిసరి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పశువులలో వచ్చే ముద్ద చర్మ (లంపి స్కిన్) వ్యాధికి వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ సాదుసురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముద్ద చర్మ వ్యాధికి మండల వ్యాప్తంగా ఉచితంగా పశువులకు వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు తెలిపారు. మొదట విడతలో 3000, రెండో విడతలు 7500 వ్యాక్సినేషన్ టీకాలు మండలానికి రాగా అందులో మొదటి విడతలో 3000 టీకాలు, రెండో విడతలో 2400 వ్యాక్సినేషన్ టీకాలను పశువులకు వేసినట్టు తెలిపారు. అన్ని పంచాయతీలలోనూ వాక్సినేషన్ కార్యక్రమం జరుగుతున్నదని, పాడి రైతులు తప్పనిసరిగా పశువులకు ముద్ద చర్మ వ్యాధి వ్యాక్సినేషన్ టీకాలను వేయించాలన్నారు. సంచార పశు ఆరోగ్య సేవ వాహనం ద్వారా పల్లెల్లో శిబిరాలను నిర్వహించి పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సాధారణంగా ఈ వ్యాధి పశువులు అపరిశుభ్రంగా ఉన్నప్పుడు వస్తుందని, పశువులను, పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పశువులపై ఈగలు, దోమల వాలకుండా పిచికారి చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం కావడంతో గొర్రెలు, మేకలకు మూతి పుండ్లు ఏర్పడి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, రైతులు పశు వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు.


ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చర్యలు తీసుకోవాలని ఎఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హాస్టల్కు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రయివేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆర్డిఒ కార్యాలయం ఎఒ శేషయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ ప్రయివేట్ కళాశాలలు ప్రభుత్వం నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయాన్ని కంటే ఎక్కువ సమయం వరకు తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. కొన్ని కళాశాల హాస్టల్లో సరైన మౌలిక వసతులు కూడా లేవని, రేకుల షెడ్లలో హాస్టల్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కళాశాల బస్సులు నడపడంలో కూడా ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్నారన్నారు. స్థాయికి మించి విద్యార్థులను బస్సుల్లో ఎక్కిస్తున్నారని తెలిపారు. కళాశాలకు సరైన గ్రౌండ్ లేదని, కొన్ని కళాశాలలకు పార్కింగ్ స్థలాలు లేవని చెప్పారు. కళాశాలలో ఎగ్జామ్స్ టైంలో విద్యార్థుల్ని ఫీజులు పేరుతో వేధిస్తున్నారని తెలిపారు. వీటపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, జిల్లా సహాయ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

పూలే విగ్రహ ఏర్పాటుకు సహకరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటుకు పాలకులు సహకరించక పోవడం దురదృష్టకరమని బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు బోడెం రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజాప్రతినిధుల తీరుపై విమర్శలు గుప్పించారు. ఎంపీ మిథున్రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్బాషాలకు పూలే విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించామన్నారు. బిసిలకు ఎస్సీ, ఎస్టీ తరహాలోనే భద్రతా చట్టం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ మోహన్, రామలింగ, బండి రామచంద్ర, వై.వి.శేఖర్ నాయుడు, శంకర్, రెడ్డెప్ప, పాల్గొన్నారు.

బిసి హక్కుల పోరాట సమితి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దశాబ్ద కాలంగా బిసిల అభివృద్ధి కోసం పోరాటం చేస్తున్న బిసి హక్కుల పోరాట సమితి ద్వారానే బిసిల సంక్షేమం సాధ్యమని బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగినేని గోవిందు, కార్యనిర్వాహక కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్క్లబ్లో బిసి హక్కుల పోరాట సమితి నూతన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నాగినేని గోవిందు, కార్యనిర్వాహక కార్యదర్శిగా మక్కినేని వేణుగోపాల్, రాయలసీమ గౌరవ అధ్యక్షులుగా చంద్రయ్య, జిల్లా కార్యదర్శిగా బొమ్మనచెరువు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా అషరఫ్, జిల్లా యూత్ కార్యదర్శిగా మల్లికార్జునలకు నియామక పత్రాలు అందించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ బిసి హక్కుల పోరాట సమితిలో స్థానం కల్పించిన వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్, బిసి హక్కుల పోరాట సమితి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్గా నవాజ్ క్రిష్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి మార్కెట్ కమిటీ డైరెక్టర్గా పట్టణ వైసిపి యువజన నాయకులు నవాజ్ క్రిష్ను ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ



చేసింది. మార్కెట్ యార్డ్ చైర్మన్గా వండాడి వెంకటేష్, వైస్ చైర్మన్గా తబ్రెజ్ ఖాన్ను మరో 13 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. నవాజ్ క్రిష్ వైసిపిలో కొనసాగుతూ పార్టీ బలోపేతానికి పాడుపడుతున్నారు. ఈ నెల 5న ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా నవాజ్ క్రిష్ మాట్లాడుతూ తనను నియమించిన ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డికి, ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్రెడ్డికి, అంజుమన్ తరీఖ్ ఉర్దూ జిల్లా అధ్యక్షులు హబీబ్ ఖాన్కు, ఎంపీ మిథున్రెడ్డికి, జిల్లా ఇన్ఛార్జిమంత్రి కాకాని గోవర్ధన్రెడ్డికి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానంకు, పాటు అన్నమయ్య జిల్లా నాయకులకు, రాయచోటి నియోజవర్గ నాయకులకు, ఆత్మీ యులకు, శ్రేయోభిలాషులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

'విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు విద్యను, గర్భిణులు, బాలింతలుకు పౌష్టికాహారాన్ని, ఇతర సేవలను అందించాలని ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. రాయచోటిలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె ఐసిడిఎస్ల పరిధిలోని ఖాళీలుగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలలో ఎంపికైన 23 మంది అభ్యర్థులకు శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. రాయచోటి ఐసిడిఎస్ పరిధిలోని సంబేపల్లె మండలంలో 4, చిన్నమండెం మండలంలో 6, రాయచోటి టౌన్, రూరల్ మండలంలో 7 పోస్టులలో 2 వర్కర్లు, 15 మంది ఆయాలకు నియామక పత్రాలు అందజేశారు. లక్కిరెడ్డిపల్లె ఐసి డిఎస్ పరిధిలో గాలివీడు మండలంలో 4, రామాపురం మండలంలో 2 పోస్టులలో 3 వర్కర్లు, 3 ఆయా పోస్టులకు శ్రీకాంత్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలును ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. తల్లి పాత్రను అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు పోషించాలన్నారు. చిన్నారులకు, బాలింతలుకు ఉత్తమ సేవలందించి అటు ప్రజలలోనూ మంచి గుర్తింపు పొందాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకోవాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. నియోజక వర్గంలో ఇంకనూ ఖాళీలుగా ఉన్న అంగన్వాడీ పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజక వర్గంలో 42 కొత్త అంగన్వాడీ కేంద్రాల మంజూరుకు కృషిచేస్తున్నటు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘ అధ్యక్షుడు చిందంబరం రెడ్డి, జడ్పిటిసి మాసన వెంకటరమణ, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె సిడిపిఒ లు శశికళ, వై పద్మావతమ్మ , చిట్లూరు మురళీధర్ రెడ్డి, సూరం వెంకట సుబ్బారెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, కనపర్తి చెన్నారెడ్డి పాల్గొన్నారు.


అంగన్వాడీలతో ఎమ్మెల్యే శ్రీకాంత్రెడ్డి

ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ జవహర్బాబు

ప్రజాశక్తి-కలకడ

ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్ బాబు పేర్కొన్నారు శుక్రవారం మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ దిగుపాలెంలో సర్పంచ్ మంజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 104 ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటు ఆరోగ్య సూత్రాలు పాటించి రోగాలు బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు అనీమియా రక్త పరీక్షలు, ఆసంక్రమ వ్యాదులకు సంక్రమన వ్యాదులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 14 రకాల వైద్య సేవలు అందించి సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి ప్రియాంక, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్న, సూపరవైజర్ రెడ్డెమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జమీల్, ఎంఎల్హెచ్పి అశ్వని, ఎఎన్ఎం లక్ష్మి, ఆశాలు సుశీలబాయ్, హైమావతి నరసమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు. **నందలూరు:** నాగిరెడ్డి పల్లి ఆరోగ్య ఉప కేంద్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్లో భాగంగా మండల వైద్యాధికారి డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 104 వైద్యులు డాక్టర్ సతీష్, ఎంఎల్హెచ్పి హిమ బిందు, ఎఎన్ఎంలు సుజాత, నాగ లక్ష్మి, లక్షుమయ్య, ఆశాలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** మండల పరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ, పిట్టావాండ్లపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం అందించారు. 104 వాహనం ద్వారా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్గా నేడు విశ్వనాథరెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రామాపురం



లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్గా శనివారం కర్ణపు విశ్వనాథరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్థానిక వైసిపి కాంగ్రెస్ పార్టీ కార్యాలయ కార్యాలయంలో నిర్వహించనున్న విశ్వనాథ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి అన్నమయ్య జిల్లా ఇన్ఛార్జి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్పర్సన్ జకియాఖానం, రాజంపేట పార్లమెంట్ సభ్యుడు మిథున్రెడ్డి, ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్రెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీనివాసులు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి, ఎంఎల్ఎలు మేడా మల్లికార్జున్ రెడ్డి, చింతల రామచంద్రరెడ్డి, ద్వారనాథరెడ్డి, మహమ్మద్ నవాజ్బాష, కడప మేయర్ సురేష్ బాబు హాజరు కానున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్గా రైతుబిడ్డ

సాధారణ రైతు కుటుంబంలో పుట్టి నేడు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి చేపట్టనున్నారు విశ్వనాథరెడ్డి. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ కర్ణపు వాండ్లపల్లెలో కర్ణపు కృష్ణారెడ్డి, రెడ్డమ్మ దంపతులకు నాలుగో సంతానం విశ్వనాథరెడ్డి. చిన్నతనం నుండే చురుగ్గా ఉంటూ రాజకీయల పట్ల మక్కువ చూపారు. నాటి లక్కిరెడ్డిపల్లి నియోజవర్గంలో యువ నాయకునిగా గుర్తింపు పొందారు. తన రాజకీయ ప్రస్థానంలో మొదటిసారిగా 1994లో స్కూల్ కమిటీ చైర్మన్ పదవి చేపట్టారు. 1998లో నల్లగుట్టపల్లి వాటర్షెడ్ చైర్మన్ పదవి చేపట్టి గ్రామాభివృద్ధితో పాటు రైతుల అభివృద్ధి కోసం కృషి చేశారు. వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెంది ఉమ్మడి కడప జిల్లా క్రషర్స్ యూనియన్ జిల్లా చైర్మన్గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ప్రస్తుతం గడికోట మోహన్ రెడ్డి ఆశీస్సులతో రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి సహకారంతో లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి చేపట్టి రైతులకు తన వంతు సేవలు అందించి అన్ని వర్గాల వారి సహాయ సహకారాలతో మరిన్ని పదవులు చేపట్టాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు

టిడిపి గెలుపునకు ఐక్యంగా కృషి చేద్దాం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తెలుగుదేశం పార్టీ గెలుపునకు ఐక్యమత్యంగా కృషి చేస్తామని మండల టిడిపి అధ్యక్షులు వెంకటరమణ, మల్లికార్జున, మాజీ ఎంపిపి మేష రామకృష్ణ అన్నారు. శుక్రవారం మదనపల్లి మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ మదనపల్లి ఇన్ఛార్జి దొమ్మలపాటి రమేష్ను పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి నిమ్మనపల్లి బస్టాండ్ కూడలిలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దొమ్మలపాటి రమేష్ను మదనపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. వారి నాయకత్వంలో వర్గ విభేదాలు లేకుండా టిడిపి నాయకులు కార్యకర్తలు ఐకమత్యంగా ఉంటూ భారీ మెజార్టీతో టిడిపిని గెలిపించుకోవడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళీ మోహన్, చంద్రాయుడు, శ్రీనివాసులు, చంద్ర, గోపి, సూరి పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ విభాగం ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి - బి కొత్తకోట

టిడిపి మైనార్టీ విభాగం ప్రమాణ స్వీకారోత్సవం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో గురువారం విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర టిడిపి అధినాయకత్వం ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.పర్వీన్ తాజ్ హాజరయ్యారు. చంద్రబాబు నాయుడుతో కలిసి ఆమె మైనార్టీ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసిందని, వారికి విరివిగా పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందని కొనియాడారు. ముస్లిం మైనార్టీ నూతన కార్యవర్గం రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి వచ్చే శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ముస్లిం మైనార్టీ విభాగం నూతన కార్యవర్గానికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ తనిఖీ

ప్రజాశక్తి -పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి అంగన్వాడీ ప్రీస్కూల్లో శుక్రవారం రైల్వేకోడూరు సిడిపిఒ రాజేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సహాయకులకు ఎటువంటి సెలవులు లేవని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు తప్పనిసరిగా పాఠశాలలో ఉండాలని సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకి మధ్యాహ్నం భోజనం పెట్టాలన్నారు. అంగన్వాడీ ప్రీస్కూల్లో హాజరు చేతాన్ని పెంచాలని తెలిపారు. కొత్తగా వచ్చిన అంగన్వాడీ టీచర్ అంగనవాడీ సహాయకులు కచ్చితంగా సమయానికి వచ్చి సమయం అయిపోయే వరకు స్కూల్లోనే ఉండాలని పేర్కొన్నారు. పలు చోట్ల అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల హాజరు శాతంపై వర్కర్లపై ఆమె మండిపడ్డారు. వర్కర్లు హెల్పర్లు విధి నిర్వహణలో వ్యక్తిగత కారణాలతో ప్రభుత్వ అధికారుల సమయాన్ని వృధా చేస్తే కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిడిపిఒ వెంట పుల్లంపేట గ్రేడ్-1 సూపర్వైజర్ మణెమ్మ ఉన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తనిఖీలలో అంగన్వాడి కార్యకర్తలు శ్రీలక్ష్మి, నాగ లత, వనజ కుమారి పాల్గొన్నారు.

పంట నమోదుపై గ్రామసభ

ప్రజాశక్తి-నందలూరు

ఖరీఫ్ 2022 సీజన్లో పంట సాగు చేసిన రైతులకు పంట నమోదు చేశారని, ఆ రైతుల వివరాలను రైతులందరికీ తెలిసే విధంగా నాగిరెడ్డి పల్లె గ్రామపంచాయతీ కుమ్మరపల్లెలో గ్రామసభ నిర్వ హించామని రాజంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమం ప్రాముఖ్యత గురించి తెలియజేయడం జరిగిందని అన్నారు. రైతు భరోసా కేంద్రం తరుపున అదించు సేవలైన నాణ్యతమైన ఎరువులు అందించడం గురించి తెలియజేసి వాటిని సద్వినియోగ పరుచుకోవా లని తెలిపారు. తదుపరి మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ పంట నమోదులో ఎవరైనా రైతుల జాబితా లేనియడల ఆ రైతు గ్రీవెన్సు ద్వారా నమోదు చేసుకోగలరని తెలియజేసారు. ఈ గ్రామ సభలో వీఆర్వో చంద్రశేఖర్ రాజు, రైతు భరోసా వివిఎలు రైతులు పాల్గొన్నారు.

మండల స్థాయి రైతు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కలికిరి

ప్రజా ప్రగతి ట్రస్ట్ స్వఛరేద సంస్థ వారు వ్యవసాయ శాఖ వారి సహకారంతో మండల స్థాయి రైతు అవగాహన కార్యక్రమం, వాల్మీకిపురం వ్యవసాయ సహాయ సంచాలకులు వాణిశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా గుండ్లూరు గ్రామ పరిధిలో గల బయ్యపరెడ్డి గారి చెరువు కింద ఉన్న రైతులకు, రాబోయే రభి పంటల సాగుపై వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ సమీకృత సాగునీరు మరియు పరివర్తన పథకం ద్వారా రైతులకు చేకూరే లబ్ధి గురించి వివరించారు. స్వఛరేద సంస్థ ప్రతినిధి ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పథకం యొక్క ప్రణాళికను మరియు దీని యొక్క ముఖ్య ఉద్దేశం గురించి మాట్లాడుతూ రైతులందరూ ఈ పథకాన్ని సకాలంలో సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మండల వ్యవసాయ అధికారిని జి ఆర్ మమతారెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ సమీకృత సాగు నీరు మరియు పరివర్తన పథకం ద్వారా రైతులు ముందస్తుగా రవి సీజన్ కొరకు ప్రణాళికను సిద్ధం చేసి వారికి కావాల్సిన విత్తనాలు, పురుగుమందులను ఈ పథకం ద్వారా సకాలంలో రైతులకు అందజేస్తామని అదేవిధంగా వ్యవసాయ శాఖ తరపు నుంచి యూరియా వాడకం దాని యొక్క ఉపయోగాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీఐఐఏటిపి తరపున టీంలీడర్ దేవేందర్, ఏపిప రజిని, రైతు కేంద్రం సిబ్బంది, హరిత నవీన్మరియు రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ ఆస్పత్రికి ఐవి కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లిలోని కమ్యూనిటీ ఆసుపత్రికి రాయచోటి లైన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఐవి సెట్లు శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగంకు సిఐ వరప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లైన్స్క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఐవి సెట్లు దాతలు ముందుకు వచ్చి ఐవి సెట్లను దాత రామలింగారెడ్డి లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి 300 ఐవి సెట్లు అందించారన్నారు. దూర ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఐవి సెట్లు కొరత ఉండడం గుర్తించి లైన్స్ క్లబ్ వారు మంచి కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు ఈ ఐవి సెట్లు ఉంటే రక్త పరీక్షలు పరీక్షించుకోవచ్చు అని పేదలకు ఉచితంగా ఐవి సెట్లు అందుబాటులో తేడా చాలా గొప్ప విషయమన్నారు చాలామంది ఐవి సెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దాతలు గుర్తించి పేదల కోసము ఐవి సెట్లు అందిస్తున్నారని తెలిపారు. సిఐ వరప్రసాద్ మాట్లాడుతూ దాతలు పేదల కోసం ఆరోగ్యం కోసం ఐవి చెట్లు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు హరిష్ చంద్ర లయన్ ప్రతాపరెడ్డి, లయన్ డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ సులోచన, శ్రీనివాస్రెడ్డి, సుభాషిని, సిబ్బంది పాల్గొన్నారు



ఆస్పత్రి సూపరింటెండెంట్కు ఐవి కిట్లు అందజేస్తున్న దాతలు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న ఎంపిపి

మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి -కలకడ

మురికినీటి కాలువల ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ గ్రామస్తులకు తెలియజేశారు. శుక్రవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ ఆంజనేయవడ్డీపల్లి, కొత్తగాండ్లపల్లి తదితర గ్రామాలలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్లు రాని వారిని గుర్తించి వారికి ఇళ్లు ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు. పంచాయితీలు వీధి దీపాలు, నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. గ్రామంలో సిసి రోడ్డు అవసరమైన చోట గుర్తించి వెంటనే సిసి రోడ్లు వేయడానికి స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రరెడ్డితో చర్చించి పనులు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.అదేవిధంగా గ్రామములో రోగాల బారిన పడకుండా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసి వైద్య శిబిరాలు ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు.కొన్ని సమస్యలను ప్రజలు అడుగగా సంబంధిత అధికారులతో చర్చించి అక్కడక్కడ పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షబానా బాను, వీఆర్వో శ్రీనివాసులు ,సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.


వేప చెట్టును పరిశీలిస్తున్న అధికారులు

వేప చెట్టును పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు కోర్టులో జరుగుతున్న ఫ్రీ లిటిగేషన్ కేస్ పిఎల్సి 31/2022 విషయమై వేప చెట్టును శుక్రవారం రాజంపేట, నందలూరు అధికారులు పరిశీలించారు. నాగిరెడ్డిపల్లె రైల్వే గేటు సమీపంలోని ఓ ఇంటి వద్ద ఆర్అండ్బి స్థలంలో ఉన్న వేప చెట్టు తొలగించాలని, చెట్టు సమీపంలో నివాసం ఉన్న ఓ ఇంటి యజమాని కోర్టును ఆశ్రయించగా, రాజంపేట ఆర్డిఒ కోదండరామిరెడ్డి చెట్టు విషయమై ఆర్అండ్బి, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలోని ఆర్అండ్బి ఇఇ రాఘవరెడ్డి, డిఇ విజయచంద్రారెడ్డి, తహశీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపిడిఒ సౌభాగ్యం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవిశంకర్ చెట్టు వద్దకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఇ రాఘవరెడ్డి మాట్లాడుతూ కమిటీలోని సభ్యులందరూ చర్చించి ఒక తీర్మానాన్ని నిర్ణయించి నివేదికను కోర్టుకు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి ప్రసాద్, వీఆర్వో రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతూ ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలి

రామాపురం: పంట సాగు చేసిన ప్రతి రైతూ ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని రాచపల్లి సచివాలయంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని, లేకపోతే ప్రభుత్వొ నుంచి వచ్చే లబ్ధి వారికి వర్తించదని చెప్పారు. ఈ క్రాప్ గురించి రైతులకు వివరించారు. రబీ సీజన్కు సంబంధించి పొద్దు తిరుగుడు విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవాలని పేర్కొన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ క్రాప్లో నమోదు చేసుకున్న రైతుల జాబితాలను చదివి వినిపించారు. మండలంలోని చిట్లూరు, సరస్వతిపల్లి, కల్పనాయుని చెరువు, గువ్వలచెరువు, గోపగుడిపల్లి. సూర్యనారాయణపురం గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగమణి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవి జయంతి


వాల్మీకిపురం: గణిత మేధావి, హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవి జయంతిని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శకుంతలాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జ్ హెచ్ఎం అమరనాథ రెడ్డి మాట్లాడుతూ 1977లో అమెరికాలో ఓ కంప్యూటర్తో శకుంతల దేవికి పోటీ పెట్టగా, 188132517 అనే సంఖ్యకు మూడో వర్గం కనుక్కోవడంలో శకుంతల దేవి గెలిపొందారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక గణితావధానములు నిర్వహించి, కంప్యూటర్ కంటే వేగంగా పలు సమస్యలను పరిష్కరించిందన్నారు. ప్రపంచంలో అతి వేగంగా గణనలు చేయడంలో గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకొందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు నాగరాజ, కల్పలత, శేఖర్ రెడ్డి, శంకర, నిర్మల, రసూల్ బావాజి, చెంగయ్య, దుర్వాసులు నాయుడు, చంద్రశేఖర్, పురుషోత్తం, వెంకటేశ్వర రెడ్డి, మధు, మాండవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎలక్ట్రికల్ షాపులో రూ.6 లక్షలు విలువైన వైర్లు చోరీ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండల కేంద్రంలోని ఓ ఎలక్ట్రికల్ షాప్లో బోర్ మోటార్ల రివైండింగ్ వైర్ల బాక్సులు చోరీ జరిగింది. మండల కేంద్రంలోని జాతీయ రహదారి రోడ్డు కెనరా బ్యాంకు పక్కనే ఉన్న స్టార్ ఎలక్ట్రికల్స్ షాపులో గురువారం అర్ధరాత్రి దొంగలు ఇనుప రాడ్లతో షాపు సెట్టర్ను పైకి లేపి షాపులో ఉన్న రూ.6 లక్షలు విలువచేసే మోటార్ రివైండింగ్ వైరు 30 బాక్సులను తీసుకెళ్లారు. ఎవరికి అనుమానం రాకుండా షాపు బయట ఉన్న సిసి కెమెరాలను పక్కకు తిప్పి, షాపులో ఉన్న సిసి కెమెరాలను సైతం తీసుకెళ్లారు. ఉదయం షాపు తెరిసేందుకు వచ్చిన షాపు యజమాని భాష చోరీ జరిగిన విషయం తెలుసుకుని ములకలచెరువు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న సిఐ సాధిక్అలీ, ఎస్ఐ డివై.స్వాములు సిబ్బందితో చోరీ జరిగిన ఎలక్ట్రికల్ షాపును పరిశీలించారు. వేలిముద్రల నిపుణులచే దుకాణంలో అనుమానం ఉన్న చోట వేలిముద్రల సేకరణ చేపట్టారు. కేసు నమోదు చేసి దోపిడీ జరిగిన సంఘటనపై విచారిస్తున్నట్లు తెలిపారు. కొంతకాలం క్రితం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న మోటార్ రివైండింగ్ షాపులో కూడా ఇదే విధంగా చోరీ జరిగింది. ఇటీవల సిసి కెమెరాల నిఘా ప్రభావంతో చోరీలు తగ్గుతున్నప్పటికీ దొంగలు సిసి కెమెరాలు లేని దుకాణాలను ఎంచుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు.


ఎలక్ట్రికల్ షాపును పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ